

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి ఎత్తిపోతల ప్రాజెక్టు

- గతేడాది వరదలకు నీట మునిగిన ప్రాజెక్ట్ మోటర్లు
- లిఫ్ట్ కింద సాగవుతున్న 400 ఎకరాలు
- ఇప్పటికే రెండు పంటలు కోల్పోయిన రైతులు
- వానకాలానికైనా నీళ్లందేనా..
- ఎత్తిపోతలపైనే 600 మంది అన్నదాతల ఆశలు
- పట్టించుకోని అధికారులపై మండిపాటు



ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద వరదలకు నేలపై పడిన ట్రాన్స్‌ఫార్మర్

# ఎత్తిపోసుడెప్పుడో?

## మరమ్మతుకు నోచుకోని మోరంచ ఎత్తిపోతల పథకం

**ఆరు వందల మంది రైతులకు కల్పతరువు ఆ ఎత్తిపోతల పథకం.. గతేడాది హఠాత్తుగా వచ్చిన వరదలకు మునిగిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కాగా, మోటర్లు మరమ్మతుకు గురయ్యాయి. దీంతో ప్రస్తుతం పనికి రాకుండా పోయింది. ఏడాదిగా అధికారులు ఇటు వైపు రాక, మరమ్మతులు చేయక పడావుపడింది. దీనిపై ఆధారపడి వ్యవసాయం చేసే అన్నదాతలు రెండు పంటలు కోల్పోయారు. ఈ వానకాలం సీజన్‌లోనైనా నీళ్లు ఎత్తిపోసుడుంటదా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇది జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచ ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ ఇరిగేషన్) ప్రాజెక్ట్ పరిధిలోని రైతుల దుస్థితి. గత జూలైలో మోరంచ వాగు ఉప్పొంగడంతో మోరంచపల్లి గ్రామం నీట మునిగి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఇదే వాగుపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల ప్రాజెక్ట్ సైతం వరద బారిన పడింది. ఇక్కడికి వెళ్లే దారి పూర్తిగా పాడైపోయింది. ఏడాదిగా మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్న రైతులు అటువైపు కన్నెత్తి చూడని అధికారులపై మండిపడుతున్నారు. తమకు ఈ సారి కూడా నీళ్లు అందించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని స్పష్టం చేస్తున్నారు.**

*- జయశంకర్ భూపాలపల్లి, జూన్ 16 (నమస్తే తెలంగాణ)*

భూపాలపల్లి మండలంలోని మోరంచవాగుపై 1970లో ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ ఇరిగేషన్) ప్రాజెక్ట్‌ను నిర్మించారు. అప్పుడు 1,260 ఎకరాల ఆయకట్టు నిర్ధారించగా, ప్రస్తుతం వానకాలంలో 400 ఎకరాలు, యాసంగిలో 150 ఎకరాలు సాగవుతున్నది. కేవలం ఈ లిఫ్ట్‌పైనే ఆధారపడి 600 మందికి పైగా రైతులు తమ పంట పొలాలను సాగుచేసుకుంటున్నారు. గతేడాది రెండు సీజన్లలో పంట సాగుచేయకపోవడంతో పొలాలు బీడుగా మారగా, రూ. 30 కోట్ల మేర పంట నష్టపోయారు. ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా, ఈ సీజన్‌లో కూడా నీరందకపోతే ఎలా బతికేదని ఆవేదన చెందుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏనాడు ఈ లిఫ్ట్‌కు ఇబ్బందులు ఎదురుకాలేదని, రెండు పంటలు సాగుచేసుకున్నామని రైతులు చెబుతున్నారు.

**మోరంచ ఉప్పొంగడంతో ...**

గతేడాది మోరంచవాగు ఉప్పొంగడంతో భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామం నీటమునిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మోరంచ ఎత్తిపోతల ప్రాజెక్టు సైతం నీట మునిగి కాలువలో ఉన్న బావి కోతకు గురైంది. మోటర్లు కూడా నీట మునగగా, ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్ బాక్సులు కొట్టుకుపోయాయి. ఎత్తిపోతల ప్రాజెక్టుకు వెళ్లే దారి పూర్తిగా ధ్వంసమైంది. కాగా, ఈ రోడ్డు నిర్మాణం పూర్తిచేసి మెటీరియల్ తరలించి లిఫ్ట్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు లిఫ్ట్ షట్టర్ కూడా ఓపెన్ చేయని అధికారులు మరమ్మతులు ఎప్పుడు చేస్తారు? పంటలకు ఎప్పుడు నీళ్లిస్తారు? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ వానకాలంలో సైతం తాము పస్తులుండాల్సిందేనా? అంటూ మండిపడుతున్నారు.

### రూ.15 లక్షలతో ప్రతిపాదనలు

మోరంచ ఎత్తిపోతల పథకం మరమ్మతుకు రూ.15 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. వారంలో నిధులు మంజూరవుతాయి. వెంటనే పనులు ప్రారంభిస్తాం. కొంచెం అటూ ఇటైనా వానకాలంకు రైతులకు నీరందిస్తాం. మోటర్లు బాగానే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయాలి. లిఫ్ట్‌కు వెళ్లే దారి పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు పనులు వేరే శాఖల అధికారులు చూసుకుంటారు.

**– రాజయ్య, టీఎస్ఐడీసీ డీఈ**

### రూ.34 లక్షలతో ప్రతిపాదనలు



వరదలతో మోరంచపల్లి గ్రామం నీటి మునిగి ఎత్తిపోతల ప్రాజెక్టు దెబ్బతిన్నది. వరదలు తగ్గుముఖం పట్టాక విషయాన్ని గత ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఆయన అధికారులను పిలిపించి రూ. 34 లక్షలతో ప్రాజెక్టు మరమ్మతుకు ప్రతిపాదనలు తయారు చేయించారు. అనంతరం ఎన్నికల హడావిడితో పనులకు బ్రేక్ పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టు వైపు అధికారులు కన్నెత్తి చూడలేదు. రెండు సీజన్లలో రైతులు కోట్ల విలువైన పంట నష్టపోయారు. డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి ఇప్పటికే మరమ్మతులు చేపట్టినా బాగుండేది.

– వేణుగోపాల్‌రెడ్డి, రైతు, మోరంచపల్లి



మోరంచవాగు

### ఈ పంటకైనా నీళ్లివ్వాలి



ఇప్పటికే రెండు పంటలు కోల్పోయాం. గత వానకాలం, యాసంగిలో నీళ్లు లేక పంటలు వేసుకోలేదు. గతేడాది జూలైలో వచ్చిన వరదలకు ఎత్తిపోతల పథకం మోటర్లు నీట మునిగాయి. ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డు సైతం కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి పనులు చేపట్టలేదు. రైతులు నారు అలికే పనిలో ఉన్నారు. లిఫ్ట్ రిపేర్ చేయకపోతే నారు అలకడం ఆపేయాలని రైతులు నిర్ణయించుకున్నారు. ఈ సీజన్ సైతం వదిలేస్తే 600 రైతు కుటుంబాలు వలస వెళ్లాల్సిందే.

– గాదం సదానందం, మోరంచ ఎత్తిపోతల ప్రాజెక్ట్ చైర్మన్



హనుమకొండలోని చైతన్య డిగ్రీ కళాశాలలో సివిల్స్ పరీక్ష రాయడానికి బారులు తీరిన అభ్యర్థులు

# ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

- ఉదయం 2,637 మంది, మధ్యాహ్నం 2,614 మంది హాజరు
- కేంద్రాలను పరిశీలించిన యూపీఎస్సీ సెంట్రల్ అబ్జర్వర్ హరిహరరథ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ, జూన్ 16 : సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మొత్తం 4,730 మంది అభ్యర్థులకు హనుమకొండలో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఉదయం 9:30 గంటల నుంచి జరిగిన పరీక్షకు 2,637 మంది (55.75 శాతం) హాజరు కాగా, 2,093 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి జరిగిన పరీక్షకు 2,614 మంది (55.26 శాతం) హాజరయ్యారని, 2,116 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. యూపీఎస్సీ సెంట్రల్ అబ్జర్వర్ హరిహరరథ్, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, సీడీసీ డీమ్డ్ యూనివర్సిటీ, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, వడ్డేపల్లిలోని పింగిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, తాళ్ల పద్మావతి ఇంజినీరింగ్ కాలేజీ, న్యూ సైన్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఏఎస్ఆర్ నేషనల్ హైస్కూల్, మాస్టర్‌జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.



సమయం కావడంతో పరుగున వస్తున్న అభ్యర్థులు



చైతన్య డిగ్రీ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



పరీక్ష రాసిన అనంతరం బయటకు వస్తున్న అభ్యర్థులు

# సకల సౌకర్యాల కస్తూర్బా



మంగపేటలో నిర్మాణమైన కేజీబీవీ భవనం

- వినియోగంలోకి వచ్చిన బాలికల విద్యాలయ శాశ్వత భవనం
- అరకొర వసతుల గదుల్లో అభ్యసించిన విద్యార్థినులకు ఊరట
- బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ 3.30 కోట్లతో నిర్మాణం

మంగపేట, జూన్16: విద్యార్థులకు సకల సౌకర్యాలతో కస్తూర్బా బాలికల విద్యాలయ భవనం వినియోగంలోకి వచ్చింది. ఈ పాఠశాల 2017 నుంచి చుంచుపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇరుకు గదులు, అరకొర వసతుల నడుమ కొనసాగింది. ఈక్రమంలో కేజీబీవీకి శాశ్వత భవన నిర్మాణం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎడ్యుకేషన్ వెల్ఫేర్ శాఖ నుంచి రూ. 3.30 కోట్లు మంజూరు చేసింది. మండల విద్యావనరుల కేంద్రం పక్కనే స్థల సేకరణ కూడా పూర్తి చేయడంతో సువిశాలమైన భవనాన్ని నిర్మించా రు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆఫీసు నిర్వహణ, తరగతి గదులు, వంటశాల, మొదటి ఫ్లోర్‌లో విద్యార్థినుల డార్మెటరీ, భోజనశాల, సెకండ్ ఫ్లోర్‌లో ల్యాబ్, సమావేశపు హాలు ఏర్పాటు చేశారు. ఈ విద్యాలయంలో ప్రస్తుతం ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు అడ్మి షన్లు ఇచ్చే ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. ప్రతి ఫ్లోర్‌లో టాయిలెట్లతోపాటు విద్యార్థినులకు అవసరమైన అన్ని సదుపాయాలతో మూడు అంతస్తులతో నిర్మాణమైన ఈ సువిశాలమైన విద్యాలయం మరో పది రోజుల్లో ప్రారంభం కానున్నది. గతంలో అరకొర వసతుల నడుమ ఇరుగు గదుల్లో కొనసాగిన కేజీబీవీకి శాశ్వత భవనం నిర్మించడంపై విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అడ్మిషన్లు ఫుల్




కేజీబీవీలో ప్రస్తుతం అడ్మిషన్లు ఫుల్ అయ్యాయి. ఇదివరకు 100 లోపే ఉన్న విద్యార్థిను ల సంఖ్య ఈ విద్యా సంవత్సరానికి 282కు చేరింది. మెయిన్ రోడ్డు పక్కనే సువిశాలమైన భవనం నిర్మాణం పూర్తి కావడంతో 6 నుంచి 10వ తరగతి వరకు 168 మంది, ఇంటర్‌మీడియట్‌లో 62 మంది విద్యార్థినులు అడ్మిషన్లు పొందారు. పాత విద్యార్థులు 52 మంది ఉన్నారు. పరిమితికి మించి విద్యార్థినులు రావడంతో నో అడ్మిషన్ బోర్డు పెట్టే పరిస్థితి ఏర్పడింది.

**– ఎంఈవో లకావత్ రాజేశ్‌కుమార్**

# నలుగురు అంతర్జాతీయ మోసగాళ్ల అరెస్ట్

- రూ. 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి



వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి

కాశీబుగ్గ, జూన్16: అంతర్జాతీయ మోసగాళ్ల ముఠాను వరంగల్ పోలీసులు పట్టుకున్నారు. జేసీబీలు, టిప్పర్లు, ప్రొక్లెయినర్లు, కార్లను ఫైనాన్షియల్ ముసుగులో మోసపూరితంగా తీసుకువెళ్లి విదేశాలకు అమ్ముతున్న దశరథ్ ముఠా గ్యాంగ్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు ఆదివారం మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తుర్కయాంజల్ గ్రామానికి చెందిన వరికుప్పల దశరథం, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్‌కు చెందిన దుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కౌశెట్టి రాకేశ్, హైదరాబాద్ ఓల్డ్‌సిటీ సంతోష్‌నగర్‌కు చెందిన మహ్మద్ జాబీర్ కలిసి కొన్నేళ్లుగా తక్కువ సమయంలో సులభంగా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో చోరీలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఆర్థిక ఇబ్బందులతో పెద్ద పెద్ద వాహనాలు అమ్మకానికి పెట్టిన యజమానుల నుంచి కొని వాటికి సంబంధించిన ఫైనాన్స్ మిగతా వాయిదాలు కడతామని నమ్మించి మోసపూరితంగా ఇతరులకు అమ్ముతున్నారు. అలాగే స్క్రాప్‌కు లేదా ముంబైలోని కొన్ని ముఠాల ద్వారా విదేశాలకు ఎగుమతులు చేస్తూ గతంలో హైదరాబాద్‌లోని పోలీసులకు పట్టుబడి సుమారు 16 కేసుల్లో జైలు జీవితం అనుభవించారు. 2023 సంవత్సరం నుంచి వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్, నల్గొండ జిల్లాలోని చింతపల్లి పోలీస్ స్టేషన్, తిప్పర్తి పోలీసు స్టేషన్, సైబరాబాద్ పరిధిలో అమనగల్ పోలీస్ స్టేషన్, మోకిలా పోలీస్ స్టేషన్‌లలో మళ్లీ సుమారు రూ. నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని వాటిని స్క్రాప్‌కు, లేదా ఇతర విదేశాలకు ఎగుమతి చేయగా వారిని మట్టెవాడ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వీరిపై 12 దొంగతనాలు, 23 వాహనాల అపహరణ కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.30లక్షల ఇన్నోవా క్రిస్టి, రూ.40లక్షల విలువైన నాలుగు స్విఫ్ట్ డిజైర్ కార్లు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, సీఐ తుమ్మ గోపి, ఎస్సై కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 170 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

## జనగామ జిల్లా రాజవరంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



రాజవరంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యం

చిల్పూరు, జూన్ 16 : టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా నిల్వ చేసిన 170 క్విటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారంతో శనివారం అర్ధరాత్రి జనగామ జిల్లా చిల్పూరు మండలం రాజవరం శివారులో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా నిల్వచేసిన 170 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన మోటం జంపయ్య, మోటం రాజశేఖర్ గ్రామ శివారులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేశారు. వీరు గ్రామాల్లో పేదల ఇళ్లకు వెళ్లి కిలో రేషన్ బియ్యాన్ని రూ. 9 చొప్పున కొనుగోలు చేసి మహారాష్ట్రలో కిలో రూ. 26 వరకు విక్రయిస్తున్నారు. సీజ్ చేసిన బియ్యం విలువ రూ. 4.46 లక్షలుంటుందని అంచనా వేశారు. పట్టుకున్న బియ్యాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ముత్యం రాజేందర్, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ వీరన్న పాల్గొన్నారు.

# ప్రజలకు విస్తృత సేవలు అందించాలి

**మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్**

మహబూబాబాద్, జూన్ 16 : మహబూబాబాద్ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు నూతనంగా ప్రారంభించిన విజయశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ విస్తృత సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలోని స్థానిక రిలయన్స్ మార్ట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయశ్రీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విజయశ్రీ హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు, సేవలు అందుబాటులో ఉన్నాయని, దవాఖాన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంతో నైపుణ్యం గల వైద్యులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ రాము, కాంగ్రెస్ నాయకులు ఖలీల్, ఎడ్ల రమేశ్, కత్తి స్వామి పాల్గొన్నారు.



విజయశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్